సాక్షి
సిద్దిపేట
మంగళవారం । 25 । మార్చి । 2025



చెద.. నిర్లక్ష్యం చేస్తే..

చెదలు.. సాగు పంటలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. నిర్లక్ష్యం వహిస్తే తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. వివరాలు 8లో ▸



రేషన్ దందా..

పేదోడి బియ్యం పక్కదారి పడుతోంది. యథేచ్ఛగా ఇతర రాష్ట్రాలకు సైతం తరలుతోంది. వివరాలు 9లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
మంగళవారం సా. 6.33 గం.	బుధవారం ఉ. 4.54 గం.

న్యూస్‌రీల్

సత్వరం అర్జీల పరిష్కారం

కలెక్టర్ మనుచౌదరి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేటరూరల్: ప్రజలు అందిస్తున్న అర్జీలను సత్వరం పరిష్కరించేందుకే ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. పలు సమస్యల పరిష్కారం కోరుతూ మొత్తం 71 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు గరీమా అగర్వాల్, అబ్దుల్ హమీద్, డీఆర్‌ఓ నాగరాజమ్మ, డీఆర్‌డీఓ జయదేవ్‌ఆర్యా, జిల్లా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సిద్దిపేట నూతన డీఎంగా రఘు



మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన రఘు

సిద్దిపేటకమాన్: ఆర్టీసీ సిద్దిపేట డిపో మేనేజర్ బదిలీ అయ్యారు. నూతన డిపో మేనేజర్‌గా టి.రఘు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు డీఎంగా విధులు నిర్వహించిన సుఖేందర్‌రెడ్డి పరిగి డిపోకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో నూతన డీఎంగా హైదరాబాద్ నుంచి రఘు బదిలీపై డిపో మేనేజర్‌గా వచ్చారు. ఈ సందర్భంగా నూతన డీఎం మాట్లాడుతూ డిపోను లాభాల బాటలో తీసుకరావడంతో పాటు కార్మికుల సంక్షేమం, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ సమష్టిగా విధులు నిర్వహించాలన్నారు.

దుబ్బాక బస్టాండ్ పరిశీలన

దుబ్బాక: నూతన డీఎం రఘు సోమవారం దుబ్బాక డిపోతో పాటు బస్టాండ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా డిపో బస్సులు, సిబ్బంది, ఏయే రూట్లలో నడుస్తున్నాయనే వివరాలను డిపో ఇన్‌చార్జిగా ఉన్న కనకలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. అలాగే డిపోకు వస్తున్న ఆదాయ వివరాలు, ఈపీకే కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు.

క్షయ నిర్మూలన అందరి బాధ్యత:డీఎంహెచ్‌ఓ

సిద్దిపేటకమాన్: క్షయ వ్యాధి నిర్మూలన అందరి బాధ్యత అని డీఎంహెచ్‌ఓ పల్వాన్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం పురస్కరించుకుని వైద్యాధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. క్షయ వ్యాధిని త్వరితగతిన గుర్తించి వారికి అవసరమైన చికిత్స అందించాలన్నారు. వైద్య సిబ్బంది టీబీ వ్యాధిగ్రస్తులపై ప్రత్యేక శ్రద్ధ వహించి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. డాట్స్ పద్ధతి ద్వారా రోగుల ఇంటికి వెళ్లి చికిత్స అందించడంతో పాటు ఆరు నెలల పాటు మందులు వాడేలా చూడాలన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, రక్తం పడటం, తరుచూ జ్వరం రావడం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

పనులు సగం సగం.. అంతా ఆగమాగం



చెట్ల కిందనే చేపల మార్కెట్

హుస్నాబాద్ మున్సిపాలిటీ.. సమస్యలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. 'స్వచ్ఛ సర్వేక్షణ్'లో ఖ్యాతిని చాటుతున్నా.. నాలుగు సార్లు జాతీయ అవార్డులు కైవసం చేసుకున్నా.. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నక్షా కార్యక్రమానికి పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైనా.. మౌలిక వసతులు కొరవడటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడం.. ఎక్కడ పడితే అక్కడ చెత్త దంపులు దర్శనమిస్తుండటంతో చాలా కాలనీలు కంపుకొడుతున్నాయి. అవార్డుల పంటతో ఆదర్శంగా నిలుస్తున్న మున్సిపాలిటీలో సమస్యలే రాజ్యమేలుతున్నాయి. 'సాక్షి' క్షేత్రస్థాయిలో జరిపిన పరిశీలనలో అనేక విషయాలు వెలుగుచూశాయి. – హుస్నాబాద్

హుస్నాబాద్ పట్టణంలో అభివృద్ధి పనులు సగంసగం చేపట్టడంతో సమస్యలు వీడటంలేదు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాలు ఉపయోగంలోకిరాక అలంకారప్రాయంగా మారాయి. ప్రధాన కూడళ్ల అభివృద్ధికి నిధులు కేటాయించినా కొన్ని జంక్షన్ల వద్ద వివిధ కారణాలతో పనులు నిలిచిపోయాయి. మార్కెట్‌కు సొంత స్థలం లేకపోవడంతో చేపలు, కూరగాయల వ్యాపారాలు రోడ్లపైనే కొనసాగుతున్నాయి. డ్రైనేజీల్లో చెత్తను తొలగించకపోవడంతో దుర్వాసన వ్యాపిస్తోంది. పలు వార్డుల్లో వారం రోజుల నుంచి మిషన్ భగీరథ నీళ్లు రాక ఇబ్బందులు పడుతున్నారు.

కూడళ్ల అభివృద్ధి నామమాత్రమే..



పట్టణంలోని పలు కూడళ్ల సుందరీకరణకు నిధులు మంజూరు చేశారు. గాంధీచౌరస్తా, శివాజీనగర్‌లో 'ఐ లవ్ హుస్నాబాద్' పేరిట సుందరీకరణ పనులు పూర్తిచేశారు. సబ్‌స్టేషన్ వద్ద కొండా లక్ష్మణ్ బాపూజీ పేరిట జంక్షన్ పనులకు శంకుస్థాపన చేశారు. తమ పట్టా భూముల్లో జంక్షన్ ఏర్పాటు చేస్తారా? అంటూ కొందరు అభ్యంతరం తెలపడంతో పనులు నిలిచిపోయాయి. అలాగే నాగారం రోడ్ చౌరస్తాలో సుందరీకరణ పనులు కేవలం స్థల పరిశీలనకే పరిమితమయ్యాయి.

సమస్యల కేరాఫ్.. హుస్నాబాద్

- ఢిల్లీ స్థాయిలో ఖ్యాతి.. వీడని దుర్గతి
- డ్రైనేజీలు అస్తవ్యస్తం.. దుర్గంధమే సమస్తం
- నిలిచిన భగీరథ.. తాగునీటికి వ్యథ.
- జంక్షన్ల సుందరీకరణ నామమాత్రం
- సెట్ బ్యాక్ లేకుండానే ఇళ్ల నిర్మాణాలు
- డంపింగ్ యార్డుల్లా ప్రైవేట్ స్థలాలు
- 'సాక్షి' పరిశీలనలో వెలుగుచూసిన వాస్తవాలు

పిల్లర్ల వరకే సమీకృత మార్కెట్..



పాత తహసీల్దార్ కార్యాలయం స్థలంలో రూ.2కోట్ల వ్యయం కాగల వెజ్, నాన్ వెజ్ సమీకృత భవనానికి శంకుస్థాపన చేశారు. కాని అది పిల్లర్ల వరకే పరిమితమైంది. ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదని సదరు కాంట్రాక్టర్ పనులను అర్ధంతరంగా నిలిపివేశారు. దీంతో కూరగాయల వ్యాపారులకు రోడ్లే దిక్కయ్యాయి. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని చెట్ల కిందనే చేపల విక్రయాలు జరుగుతున్నాయి. దీంతో వ్యాపారులు, ప్రజలు కూడా ఇబ్బందులకు గురవుతున్నారు.



అలంకారప్రాయంగా రైతుబజార్

పట్టణంలోని శివాజీనగర్‌లో దాదాపు మూడు కోట్ల వ్యయంతో నిర్మించిన రైతుబజార్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో రైతుబజార్, మొదటి, రెండో అంతస్తులు ఫంక్షన్‌హాల్‌కు కేటాయించారు. కాని ఇంతవరకు అవి అందుబాటులోకి రాలేదు. దీంతో స్థలం లేక రైతులు రోడ్లపైనే దుమ్ము, ధూళిలోనే తమ ఉత్పత్తులు అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది.

రోడ్లపైనే అంగడి బజార్



ప్రతి శుక్రవారం నిర్వహించే అంగడికి ప్రత్యేకమైన స్థలం లేక రోడ్లపైనే కొనసాగుతోంది. అంగడి వల్ల ప్రతియేటా మున్సిపల్‌కు రూ.లక్షల ఆదాయం వస్తుంది. అయినా సౌకర్యాలపై దృష్టి సారించడం లేదు. దీంతో కూరగాయలతో పాటు చిరు వ్యాపారులు రోడ్లపైనే దుకాణాలు పెట్టుకోవాల్సిన దుస్థితి. చిరు వ్యాపారుల నుంచి రుసుం వసూలు చేస్తున్నా.. తాగునీరు, నీడ లాంటి కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. ఎండకు ఎండుతూ వానకు నానుతూ కాలం వెళ్లదీస్తున్నారు.

ఒకే ఒక్క దంపింగ్ యార్డు

మున్సిపాలిటీ పరిధిలో ఒకే ఒక్క డంపింగ్‌యార్డు ఉంది. అదికూడా పట్టణానికి దాదాపు 3కి.మీ. దూరంలో ఉంది. అయితే చెత్తతో పాటు ఇళ్ల నిర్మాణాల వేస్టేజీని కొందరు ప్రభుత్వ ఆస్పత్రి వద్ద బైపాస్ రోడ్‌లో వేస్తున్నారు. అటుగా వెళ్లేవారు దుర్గంధానికి తట్టుకోలేక ముక్కులు మూసుకుంటున్నారు. ప్రైవేట్ స్థలాల్లో ఇంటి నిర్మాణాల వేస్టేజీని పోస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

డ్రైనేజీల్లో చెత్తాచెదారం



పట్టణంలోని పలు కాలనీల్లోని మురుగు కాలువలు చెత్తాచెదారంతో నిండిపోయాయి. చెత్తను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో అవి పందులకు నిలయంగా మారాయి. అలాగే పలు కాలనీల్లో మురుగు కాలువలు నిర్మించకపోవడంతో వాడిన నీరంతా రోడ్లపైనే నిలిచిపోతోంది. దీంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు.

అడ్డదిడ్డంగా పార్కింగ్



పార్కింగ్ స్థలం లేకపోవడంతో వాహనాలను దుకాణాల ఎదుటే అడ్డదిడ్డంగా నిలుపుతున్నారు. దీనికి తోడు మురుగు కాలువలపై సామగ్రి ఉంచుతున్నారు. రోడ్లపైనే వాహనాలు నిలిపివేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. మున్సిపల్ అధికారులు దుకాణాల ఎదుట హద్దులు నిర్ణయించి గీత దాటవద్దని హెచ్చరిస్తున్నారు. అంగడి రోజు ట్రాఫిక్ సమస్యతో వాహనాలు స్తంభించి ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. బాధ్యులకు మున్సిపల్ అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారు.

హుస్నాబాద్ మున్సిపల్ స్వరూపం

- విస్తీర్ణం: 25 చదరపు కి.మీ.
- వార్డులు: 20
- జనాభా: 30,353
- ఇళ్లు: 7,343
- తాగునీటి పథకం: మిషన్ భగీరథ
- అవసరమైన తాగునీరు: 2.9 ఎంఎల్‌డీ
- చెత్త సేకరణ వాహనాలు: 11
- చెత్త ఉత్పత్తి: సుమారు 12 టన్నులు
- పబ్లిక్ టాయిలెట్లు: 6
- వీధి దీపాలు: 2,780
- బస్తీ దవాఖానాలు: 1
- స్వయం సహాయక సంఘాలు: 5,343
- వీధి వ్యాపారులు: 1,450 మంది

నో సెట్ బ్యాక్..

మున్సిపల్ పరిధిలో వివిధ రోడ్లు ఇరుకుగా మారాయి. ఒక వాహనం వచ్చిందంటే మరో వాహనం వెళ్లలేని పరిస్థితి. కనీసం 30 ఫీట్లు రహదారికి విడిచి ఇళ్లు నిర్మించుకోవాలని నిబంధన ఉంది. కాని అవేవీ పట్టించుకోకుండా సెట్ బ్యాక్ లేకుండానే చాలా మంది ఇళ్లు నిర్మించుకున్నారు. మున్సిపల్ అధికారులు ఇంటి అనుమతితోనే సరిపెడుతున్నారు. నిబంధనల అమలును పట్టించుకోవడంలేదు.

తాగునీరు రావడంలేదు



మా వార్డులో వారం రోజుల నుంచి మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు. సంపు వద్ద మోటారు కాలిపోయిందని చెబుతున్నారు. వారం నుంచి మోటార్లు మరమ్మతులు చేపట్టడంలో జాప్యం చేస్తున్నారు. ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి. ప్రతి నెలా నీటిపన్ను కింద రూ.100 వసూలు చేస్తున్నారు. త్వరలో తాగునీటి సమస్య పరిష్కరించాలి.

– కవ్వ వేణుగోపాల్‌రెడ్డి, హుస్నాబాద్

చెత్తను తొలగించండి



మురుగుకాలువలు చెత్తతో నిండిపోయాయి. సకాలంలో చెత్త తొలగించకపోవడంతో దుర్వాసన వ్యాపిస్తోంది. దోమలు, పందులకు స్థావరాలుగా మారాయి. కొన్ని వీధుల్లో కాలువల నిర్మాణాలు లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. దీంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. అధికారులు పారిశుద్ధ్య నిర్వహణపై శ్రద్ధ వహించాలి.

– రాగుల శ్రీనివాస్, హుస్నాబాద్

నీటి ఎద్దడిని నివారిస్తాం



మహ్మదాపూర్ మిషన్ భగీరథ సంపు వద్ద మోటార్లు కాలిపోవడంతో మరమ్మతులు చేపడుతున్నాం. త్వరలోనే నీటి సరఫరాను పునరుద్ధరిస్తాం. సెట్ బ్యాక్ కాకుండా ఇళ్లు నిర్మించుకుంటే చర్యలు తీసుకుంటాం. ఆస్పత్రి బైపాస్ రోడ్‌లో వేస్టేజీని తొలగిస్తాం. పలు కాలనీల్లో మురుగు కాలువల నిర్మాణం చేపడతాం. మున్సిపాలిటీలో సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తాం.

– మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్, హుస్నాబాద్

నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తా

- గజ్వేల్‌లో పెండింగ్ పనులకు సైతం నిధులు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ
- ముగిసిన నర్సారెడ్డి పాదయాత్ర
- కేసీఆర్ శాసన సభ్యత్వాన్ని రద్దు చేయాలని రాజ్‌భవన్‌లో ఫిర్యాదు



గజ్వేల్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో సీఎం రేవంత్‌రెడ్డి

గజ్వేల్: మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. మాజీ సీఎం కేసీఆర్‌కు వ్యతిరేకంగా 'గజ్వేల్ పోరు బాట' పేరుతో డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి చేపట్టిన పాదయాత్ర సోమవారం హైదరాబాద్‌లో ముగిసింది. ఈ సందర్భంగా నర్సారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో ముఖ్యమంత్రిని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ప్రజలకు, అసెంబ్లీకి దూరంగా ఉంటున్న కేసీఆర్‌ను భర్తరఫ్ చేయాలని సీఎంకు వినతి పత్రం అందజేశారు. అనంతరం సీఎం మాట్లాడుతూ పాదయాత్ర చేపట్టిన నర్సారెడ్డిని అభినందించారు. ప్రత్యేకించి నిర్వాసితుల సమస్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు సీఎం వెల్లడించారు. అలాగే గజ్వేల్‌లో పెండింగ్‌లో ఉన్న పనులకు నిధులు ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ శ్రేణులతో కరచాలనం చేశారు. కాగా కేసీఆర్ శాసన సభా సభ్యత్వాన్ని భర్తరఫ్ చేయాలని రాజ్‌భవన్‌లోనూ కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆంక్షారెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు భూంరెడ్డి, ఎలక్షన్‌రెడ్డి, గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, కాంగ్రెస్ నియోజకవర్గ ప్రచార కమిటీ కన్వీనర్ నిమ్మ రంగారెడ్డి, టీపీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి సాజిద్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ కాంగ్రెస్‌లో సయోధ్య



సీఎం రేవంత్ ఎదుట నర్సారెడ్డి, శ్రీకాంత్‌రావుల కరచాలనం

గజ్వేల్: కాంగ్రెస్‌లో సయోధ్య వ్యవహారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్దకు వెళ్లింది. నియోజకవర్గంలో రెండు గ్రూపులుగా విడిపోయిన డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి బందారు శ్రీకాంత్‌రావులను కొన్ని రోజుల కిందట ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా పిలుపించుకొని మాట్లాడారు. విభేదాలు పక్కన బెట్టి పార్టీ పటిష్టతకు కృషిచేయాలని ఇద్దరు నేతలకు సూచించారు. ఈ విషయాన్ని ఇరువురు నేతలు ధ్రువీకరించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు సైతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

మైనార్టీల సంక్షేమం పట్టని సర్కార్

ఎమ్మెల్యే హరీశ్‌రావు



గజ్వేల్: ముస్లిం, మైనారిటీల సంక్షేమంపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సోమవారం గజ్వేల్‌లోని మదీనా మసీద్‌లో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ మంత్రి వర్గంలో ఒక్క ముస్లిం, మైనారిటీకి స్థానం కల్పించకపోవడం దారుణమన్నారు. గతేడాది బడ్జెట్‌లో ప్రభుత్వం మైనార్టీల సంక్షేమం కోసం రూ.3వేల కోట్లు కేటాయిస్తే.. వెయ్యి కోట్లు మాత్రమే విడుదల చేసి అవి కూడా ఖర్చు చేయలేదన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు డాక్టర్ యాదవరెడ్డి, దేశపతి శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నేతలు వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఫారుక్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.





వైభవంగా అగ్నిగుండాలు

ముగిసిన మల్లన్న బ్రహ్మోత్సవాలు

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లన్న క్షేత్రంలో అగ్నిగుండాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కొమురవెల్లిలో ఆదివారం అర్ధరాత్రినుంచి సోమవారం వేకువజాము వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. పది వారాల పాటు స్వామి వారి బ్రహ్మోత్సవాలు కొనసాగాయి. బ్రహ్మోత్సవాలు ప్రతి ఏటా మార్గశిర మాసం చివరి ఆదివారం (సంక్రాంతి తరువాత వచ్చే ఆదివారం)తో మొదలై పాల్గున మాసం చివరి ఆదివారం వరకు మూడు నెలల పాటు వైభవోపేతంగా జరుగుతాయి. ఉత్సవాలలో సుమారు 12 లక్షల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. తెలంగాణ భక్తులతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

కల్తీపై కుస్తీ

కట్టడికి 'ఫుడ్ సేఫ్టీ' వాహనం



జిల్లాకు చేరిన ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ వాహనం

జిల్లాలో సంచార ఆహార పదార్థాల ప్రయోగశాల

- రెస్టారెంట్ల వద్దకే వెళ్లి ఆహార పరీక్షలు..ఆ వెంటనే నివేదికలు
- త్వరలో ప్రారంభిస్తామంటున్న ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ అధికారులు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: హోటళ్లు, రెస్టారెంట్లను తనిఖీలు చేయడం.. ఆహార పదార్థాల శాంపిళ్లను సేకరించడం.. వాటిని ల్యాబ్‌కు పంపడం.. పరీక్షలు చేయడం.. నివేదికలు రావడం.. ఇలా ఈ ప్రక్రియ అంతా ముగిసే సరికి కొన్ని వారాలు పడుతోంది. అప్పుడు ఆహారం కల్తీ చేసిన వారిపై చర్యలకు ఉపక్రమించేందుకు వీలుంటుంది. కానీ ఇప్పుడు ఈ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం 'ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్'పేరుతో మొబైల్ ల్యాబ్‌ను జిల్లాకు మంజూరు చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సాయంతో మంజూరైన ఈ సంచార ఆహార పదార్థాల ప్రయోగశాల వాహనం సంగారెడ్డికి చేరింది. ఈ వాహనం ఉమ్మడి జిల్లా అంతటా తిరుగుతూ రెస్టారెంట్లు, హోటళ్లు, ఆహారం, సంబంధిత సరుకులు అమ్మే రెస్టారెంట్లు, హోటళ్లు, మాల్, దుకాణాలు, ఇతర వ్యాపార సంస్థల వద్దకు వెళ్లి అక్కడి ఆహార వస్తువులను పరీక్షలు నిర్వహించి వెంటనే నివేదిక ఇస్తుంది. జాతరలు, ఎక్కువ సంఖ్యలో ప్రజలు గుమిగూడే ప్రదేశాలకు వెళ్లి అక్కడ విక్రయిస్తున్న ఆహార పదార్థాలను తనిఖీలు చేయనుంది. ఆహారంతో పాటు, పాలు, వంట నూనెలు, తాగే నీరు ఇలా అన్నింటిని పరీక్షలు చేస్తుంది. ఈ పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన సిబ్బందినికి కూడా నియమించారు. సుమారు 50 రకాల పరీక్షలు నిర్వహించేందుకు వీలుంటుందని ఫుడ్ సేఫ్టీ అధికారులు పేర్కొంటున్నారు.


అవగాహనతో పాటు శిక్షణ సైతం

ఈ వాహనాలు కేవలం ఆహార కల్తీలను గుర్తించే పరీక్షలు నిర్వహణకే పరిమితం కాదు. కల్తీలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారు. ఆయా ప్రాంతాల్లో తనిఖీలకు వెళ్లినప్పుడు కల్తీ జరిగినట్లు నిర్ధారణ అయితే వెంటనే అక్కడి ప్రజలకు ఈ కల్తీ గురించి వివరిస్తారు. మరోవైపు కల్తీకి పాల్పడుతున్న వ్యాపార, వాణిజ్య సంస్థలకు సంబంధించిన వ్యక్తులకు కల్తీ చేయకుండా శిక్షణ ఇస్తారు. హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వహణపై సంబంధిత వ్యక్తులకు శిక్షణ కూడా ఇస్తారని అధికారులు తెలిపారు.

అన్నింటా కల్తీనే..

ఆహార పదార్థాలు యథేచ్ఛగా కల్తీ జరుగుతోంది. రెస్టారెంట్లు, హోటళ్లు, దుకాణాలు, నిత్యావసర సరుకులు విక్రయించే మాల్స్ ఇలా అనేక చోట్ల ఆహార సంబంధిత వస్తువులు కల్తీ అవుతున్నాయి. వంటనూనెలు, కారం, మసాలాలు, నెయ్యి, పాలు, పప్పుదినుసులు, ఇతర నిత్యావసరాలు చాలా మటుకు కల్తీ అవుతున్నాయి. రెస్టారెండ్లు, హోటళ్లలో విచ్చలవిడిగా ఫుడ్ కలర్స్ వాడుతున్నారు. కంటికి ఇంపుగా కనిపించేలా వాడుతున్న ఈ ఫుడ్ కలర్స్‌తో ప్రజల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటోంది. క్యాన్సర్‌తో పాటు, జీర్ణక్రియకు సంబంధించిన ఆరోగ్యసమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఏదీ కల్తీనో, ఏది నాణ్యమైన సరుకులో తేల్చుకోవడం సామాన్య ప్రజలకు అవగాహన ఉండటం లేదు. దీన్ని ఆసరాగా చేసుకుని ఈ వ్యాపార సంస్థలు అక్రమాలకు పాల్పడుతున్నాయి.

గోదావరి సవ్వళ్లు.. హల్దీ పరవళ్లు



నాచగిరి 'హల్దీ' పరవళ్లు తొక్కుతోంది. నీటి ప్రవాహం నేత్రపర్వం చేస్తోంది. సోమవారం పుణ్యక్షేత్రం వద్ద చెక్‌డ్యాంలోకి గోదావరి జలాలు పొంగిపొర్లుతుండడంతో భక్తజనులు మురిసిపోయారు. బ్రహ్మోత్సవాల తరుణంలో జలకళతో జాతర జనానికి ఆనందం, ఆహ్లాదం, నదీస్నానం సౌకర్యం సమకూరింది. – వర్గల్(గజ్వేల్)

క్లుప్తంగా

ఘనంగా స్వామివారి కల్యాణం

- దర్శించుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, నాయకులు



కల్యాణోత్సవ వేడుకల్లో యాదవరెడ్డి

గజ్వేల్‌రూరల్: శ్రీలక్ష్మీ నరసింహుని కల్యాణోత్సవ పూజా కార్యక్రమాల్లో పాల్గొనడం తమ అదృష్టమని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని శ్రీగిరిపల్లి గ్రామంలో కొలువుదీరిన స్వయంభూ శ్రీగిరి లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. భగవంతుడి ఆశీస్సులు భక్తులపై ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండేలా చూడాలని కోరుకున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ తాజా మాజీ సర్పంచ్ చంద్రమోహన్‌రెడ్డి, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, భక్తులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం



లైల

కొండపాక(గజ్వేల్): వివాహిత అదృశ్యమైన ఘటన కుకునూరుపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ కథనం మేరకు.. జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా మహాముత్తారం గ్రామానికి చెందిన భార్యాభర్తలు కాల్వ లైల, రాజేశ్ రెండు నెలల కిందట పని కోసం కుకునూరుపల్లికి వచ్చి ఓ హోటల్‌లో పనికి కుదిరారు. గత నెల 27న హోటల్‌లో పని ముగించుకొని రాత్రి భోజనం చేసి ఇంట్లో నిద్రించారు. మరుసటి రోజున ఉదయం లేచి చూసేసరికి భార్య కనిపించపోవడంతో రాజేశ్ స్నేహితులు, బంధువులు వద్ద వెతికాడు. ఎక్కడా ఆచూకీ లభ్యం కాలేదు. లైల అదృశ్యమవ్వడానికి స్నేహితుడు కనకం సుమన్‌పై అనుమానం ఉందని రాజేశ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

పొలంలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

- డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ప్రమాదం



పొలంలో బస్సు

బెజ్జంకి(సిద్దిపేట) : మండలంలోని ముత్తన్నపేట శివారులో గల కల్వర్టు సమీపంలో కరీంనగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సోమవారం ప్రమాదవశాత్తు పొలంలోకి దూసుకెళ్లింది. స్థానికుల కథనం మేరకు.. 42 మంది ప్రయాణికులతో కరీంనగర్ నుంచి బెజ్జంకి వైపునకు వస్తుండగా లింక్‌రాడ్ విరిగింది. బస్సు కల్వర్టు కిందకు వెళ్తుండగా డ్రైవర్ సంపత్ అప్రమత్తమై పక్కనే ఉన్న పొలంలోకి దించారు. దీంతో బస్సులోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఘటనా స్థలాన్ని డిపో మేనేజర్ సరస్వతి పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. డ్రైవర్‌ను ప్రయాణికులు అభినందించారు.

కుక్క దాడిలో చిన్నారికి గాయాలు

జగదేవ్‌పూర్(గజ్వేల్) : కుక్క దాడిలో చిన్నారికి గాయాలైన ఘటన మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జగదేవ్‌పూర్‌కు చెందిన సుష్మ, బస్వారాజ్ దంపతుల కూతురు సానిధ్య(5) జగదేవ్‌పూర్‌లోనే అక్షర ప్రైవేట్ పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతుంది. సోమవారం పాఠశాలకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికొచ్చింది. ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా కుక్క దాడి చేయడంతో ముఖానికి తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే గజ్వేల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని పాఠశాల కరస్పాండెంట్ తెలిపారు.

బోరు నీళ్లే దిక్కు

వ్యాధుల బారిన తెల్లాపూర్ మున్సిపాలిటీ వాసులు



ఉస్మాన్‌నగర్‌లో సిద్ధమైన మిషన్ భగీరథ ట్యాంక్

- తాగడానికి, స్నానానికి అవే నీళ్లు
- చర్మ వ్యాధులు, హెయిర్ ఫాల్స్‌తో గేటెడ్ కమ్యూనిటీ వాసుల ఆందోళన
- స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలని జలమండలికి వినతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నగర కాలుష్యానికి దూరంగా, ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలన్న లక్ష్యంతో ఐటీ, ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారస్తులు శివారు ప్రాంతాలలో కోట్లాది రూపాయలతో విల్లాస్, బహుళ అంతస్తుల భవంతులను కొనుగోలు చేసి నివాసముంటున్నారు. ఆధునిక వసతులు ఉన్నప్పటికీ తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. స్వచ్ఛమైన నీరు లేక బోరు నీటిని ఫిల్టర్ చేసుకొని వాటినే స్నానాలకు, ఇతర అవసరాలకు వాడుతున్నారు. ఈ నీటితో స్నానాలు చేయడం వల్ల చర్మ వ్యాధులు రావడంతోపాటు తలపై జుట్టు ఊడిపోతుంది. ఇంత జరుగుతున్నా జల మండలి వారు పట్టించుకోవడం లేదని తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రక్షిత తాగునీరు లేక..

90 శాతం గేటెడ్ కమ్యూనిటీ కాలనీల్లో రక్షిత నీరు లేక తాగునీటి నిత్యం కొనుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. తాగునీటి కోసం డబ్బులు ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చర్మవ్యాధులతో ఇబ్బందులు

కాలనీవాసులు బోరు నీటితో స్నానం చేయడం వల్ల చర్మం రంగు మారడం, పొడిగా మారడంతోపాటు దురదలు వస్తున్నాయి. వాటితో పలు చర్మ వ్యాధులు రావడంతో కాలనీ వాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు. యుక్త వయస్సు వారి నుంచి ముసలి వారి వరకు తలపై జుట్టు రాలిపోతుంది. ప్రధానం మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైద్యం కోసం వేలాది రూపాయలను ఖర్చు చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యమే కారణమా..?

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో సుమారు 33 గేటెడ్ కమ్యూనిటీ కాలనీలు ఉండగా అందులో కేవలం 4 కాలనీలకు మాత్రమే రక్షిత తాగునీటి అందిస్తున్నారు. ఉస్మాన్‌నగర్‌లో 40 లక్షల సామర్థ్యం గల సంపు, 20లక్షల సామర్థ్యం గల ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణంతో 22 కిలోమీటర్లు పైపులైన్ పనులు పూర్తయ్యాయి. కేవలం కాలనీలకు పైపులైన్‌లను కనెక్ట్ చేయాల్సి ఉంది. జలమండలి అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గేటెడ్ కమ్యూనిటీ కాలనీలకు రక్షిత తాగునీటి అందించడం వల్ల ప్రతి నెలా బిల్లుల రూపంలో కోట్లాది రూపాయలు వచ్చే అవకాశం ఉన్నాయి.

చర్మవ్యాధులు వస్తున్నాయి



రక్షిత తాగునీరు సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నాం. ఉన్న బోరు నీటిని ఫిల్టర్ చేసుకొని అవసరాలను తీర్చుకుంటున్నాం. ఆ నీటితో స్నానాలు చేయడంన్లా చర్మ వ్యాధులు వస్తున్నాయి. తలపై జుట్టు ఊడిపోతుంది.

– మదన్ మోహన్ బాబు, ముప్పా ఇంద్రప్రస్థ విలాస్ నివాసి

ఇబ్బందులు పడుతున్నాం



తాగునీరు లేక ఇబ్బందులు తప్పడంలేదు. నిత్యం తాగునీటి కొనుకుంటున్నాం. కాలనీలో వచ్చే బోరు నీటిని వాడుకుంటున్నాం. ఆ నీటితో అనేక వ్యాధులు ప్రబలి అవస్థలు పడుతున్నాం.

– రవీందర్, సైబర్‌కాలనీ

కొనుక్కొని తాగుతున్నాం



నిత్యం తాగునీటిని కొనుక్కొని తాగాల్సిన పరిస్థితి ఉంది. గతంలో బోరు నీటి కారణంగా సుమారు వంద మంది ఇబ్బంది పడ్డాం. బోరు నీటి వలన అనేక ఆరోగ్య సమస్యలు వచ్చాయి. పాలకులు మాకు రక్షిత తాగునీటి అందించి ప్రజల ఆరోగ్యలను కాపాడాలని కోరుకుంటున్నాం.

– రవిరమణ, ఇండస్ట్రెస్ట్ అపార్ట్‌మెంట్

బోరు నీటితోనే అవసరాలు తీర్చుకుంటూ..

గేటెడ్ కమ్యూనిటీ కాలనీల్లో 90 శాతం బోరు నీటిపైనే ఆధారపడుతున్నారు. బోరు నీటి ట్రీట్‌మెంట్ చేసి ఆ నీటినే స్నానాలకు, ఇతర అవసరాలకు వాడుకుంటున్నారు. వీటి వల్ల ఇళ్లలోని వాషింగ్ మిషన్‌లు, వాటర్ ప్యూరిఫై మిషన్‌లు పాడవుతున్నాయి. స్టీల్ వస్తువులను, ఇంటి నేలను శుభ్రం చేసి వాటిపై మచ్చలు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బోరునీటిను శుద్ధి చేసే ప్లాంట్

శేషవాహనంపై నాచగిరీశుడు

- వైభవంగా బ్రహ్మోత్సవాలు
- నేడు పెద్ద గరుడోత్సవసేవ



నాచగిరి క్షేత్రంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు నేత్రపర్వం చేస్తున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి శేషవాహనోత్సవ సేవ వైభవంగా జరిగింది. పట్టువస్త్రాలు, పూలమాలికలు, ఆభరణాలతో విశేషాలంకృతమైన ఆదిశేషుని పడగనీడలో శ్రీనృసింహస్వామివారు లక్ష్మీ సమేతులై ఊరేగారు. శేషవాహనంపై శ్రీవారి వైభవం ప్రత్యక్షంగా తిలకించి భక్తజనులు తరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి పెద్ద గరుడ సేవ జరుగుతుంది. రాత్రి 10 గంటలకు వేడుక ప్రారంభమై ఒంటి గంట వరకు కొనసాగుతుంది. ఈ సందర్భంగా భక్తుల కోసం క్షేత్రంలో తగు ఏర్పాట్లు చేశామని ఈఓ. విశ్వనాథశర్మ తెలిపారు.

–వర్గల్(గజ్వేల్):

స్కూటీని ఢీకొట్టిన బస్సు

పటాన్‌చెరు టౌన్ : స్కూటీని బస్సు ఢీకొట్టిన ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు శాంతినగర్‌కి చెందిన శ్రీనివాసరావు మండల పరిధిలోని రుద్రారం తోషిబా పరిశ్రమ లో ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం విధులు ముగించుకొని తోటి ఉద్యోగి రాజయ్య గౌడ్‌తో కలిసి స్కూటీ పై పటాన్‌చెరు వైపు వచ్చేందుకు గణేశ్‌గడ్డ చౌరస్తా కు వచ్చారు. ఇస్మాల్‌ఖాన్‌పేట్ నుంచి గణేశ్ గడ్డ చౌరస్తాకు వచ్చిన బస్సు వెనుక నుంచి స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసరావుకు తీవ్ర గాయాలు కాగా రాజయ్యకి స్వల్ప గాయాలయ్యాయి. శ్రీనివాసరావు కుమారుడు లోకేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానాలు

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో 23 మంది పట్టుబడినట్టు తెలిపారు. వీరిని సోమవారం కోర్టులో హాజరుపర్చగా ఏడుగురికి రూ. 2 వేలు, 15 మందికి రూ.1,500, మరొకరికి రూ. వెయ్యి జరిమానా విధించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

సంగారెడ్డి క్రైమ్: సంగారెడ్డి పట్టణ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం అర్ధరాత్రి పోతిరెడ్డిపల్లి, పాతబస్టాండ్, బైపాస్‌లోని గుర్రపుబొమ్మ వద్ద నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో 12 మందిని పట్టుకున్నట్లు ట్రాఫిక్ సీఐ సుమన్‌కుమార్ తెలిపారు. కోర్టులో హాజరుపరచగా 8 మందికి రూ.2,000, నలుగురికి రూ.1500 జరిమానా విధించినట్లు తెలిపారు.

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించగా ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా ఒకరికి రెండు రోజులు, మరో వ్యక్తికి ఒక రోజు జైలు శిక్ష విధించారు. మరొకరికి రూ.2 వేలు జరిమానా విధించినట్లు గుమ్మడిదల ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.

ప్రయాణికురాలి మెడలోంచి

బంగారం చోరీకి యత్నం

సంగారెడ్డి క్రైమ్: ప్రయాణికురాలి మెడలోంచి గుర్తు తెలియని దుండగులు బంగారం చోరీకి యత్నించిన ఘటన పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ రమేశ్ కథనం మేరకు.. పట్టణంలోని హనుమాన్ నగర్ (కింది బజారు)కు చెందిన బేగరి శాంతమ్మ (75) ఆదివారం పాత బస్టాండ్ శివారులోని ఆర్యన్ ఫంక్షన్‌లో బంధువుల వేడుకకు హాజరైంది. అనంతరం ఇంటికెళ్లడానికి ఫంక్షన్ హాల్ బయట నిల్చుంది. గుర్తు తెలియని దుండగులు వచ్చి సంగారెడ్డి వైపుగా వెళ్లే ఆటోలో ఎక్కించుకున్న తర్వాత వృద్ధురాలిని మాటల్లో పెట్టి మెడలోంచి ఆభరణాలు చోరీకి యత్నం చేశారు. అప్రమత్తమైన ఆమె కేకలు వేయడంతో బంధువులు రావడాన్ని చూసి దుండగులు పరారయ్యారు. బాధితురాలు శాంతమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి



నర్సింలు(ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): చేపలు పట్టేందుకు వెళ్లి చెరువులో మునిగి మత్స్యకారుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధి దొంతి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కట్లే నర్సింలు(45) చేపల అమ్మకం ద్వారా జీవనోపాధి పొందుతున్నాడు. ఆదివారం చేపలు పట్టేందుకు స్థానిక కుందలమ్మ చెరువుకు వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చెరువు వద్దకు వెళ్లి చూడగా నర్సింలుకు సంబంధించి టీవీఎస్ ఎక్సెల్‌తో పాటు బట్టలు, చెప్పులు గట్టుపై కనిపించాయి. సోమవారం ఉదయం చెరువులో గాలించగా మృతదేహం బయటపడింది. చెరువులో చేపల కోసం వేసిన వల నర్సింలు చేతికి చుట్టుకోవడంతో నీటి మునిగి మృతి చెందాడు. మృతుడి తమ్ముడు పోచయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సాగు నీరందించడంలో విఫలం

సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి



మాట్లాడుతున్న మల్లారెడ్డి

చేర్యాల(సిద్దిపేట): గోదావరి జలాలతో తపాస్‌పల్లి రిజర్వాయర్ నింపి చేర్యాల ప్రాంత చెరువులు, కుంటలకు వదిలి రైతుల పంటలకు సాగు నీరందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పాత బస్టాండ్ వద్ద రైతాంగానికి మద్దతుగా సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట్ట మండలాల్లో ప్రతీయేటా పంటలు ఎండిపోతుంటాయన్నారు. గత ప్రభుత్వాలు ముందుచూపుతో దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను నింపి కాల్వల ద్వారా నాల్గు మండలాల్లోని చెరువులు, కుంటలను నింపడం ద్వారా పంటలు పండేవన్నారు. ఈసారి కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, నాయకులకు ఈ ప్రాంత రైతుల పట్ల ముందుచూపు లేక తపాస్‌పల్లి రిజర్వాయర్ నింపడంలో నిర్లక్ష్యం వహించి పంటలు ఎండిపోవడానికి కారణం అయ్యారన్నారు. దీంతో చేర్యాల ప్రాంత రైతాంగం తీవ్రంగా నష్టపోయారన్నారు. ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ.50వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సత్తిరెడ్డి, వెంకట్‌మావో, కృష్ణారెడ్డి, యాదగిరి, అరుణ్, రవీందర్, నాగరాజు, షఫీ, నర్సిరెడ్డి, శ్రీహరి, ప్రభాకర్, మల్లేశం, భాస్కర్, చందు, అశోక్, దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్, బాలు, కనకయ్య, శ్రీకాంత్, ఇస్తారి, చక్రపాణి, రమేశ్, నర్సింగరావు, యాదగిరి, రంజిత్‌రెడ్డి, భరత్, రాంరెడ్డి, సత్తయ్య, కృష్ణమూర్తి, నూర్‌బి, కనకవ్వ, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో జీవాలు మృత్యువాత

మూడు గేదెలు



మృత్యువాత పడిన గేదెలు

సదాశివపేట(సంగారెడ్డి): విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృతి చెందిన ఘటన పట్టణ పరిధిలోని ఎన్‌గార్డెన్ ఫంక్షన్ హాలు సమీపంలోని ఓ వెంచర్‌లో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని ఆత్మకూర్ గ్రామానికి చెందిన రైతు సురేశ్ సదాశివపేట పట్టణంలో నివాసం ఉంటూ గేదెలు మేపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. మూడు గేదెలు మేతకోసం అటుగా వెళ్లి కరెంట్ షాక్‌కు గురై మృతి చెందాయి. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే తన గేదెలు మృతి చెందాయని, రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

మొగుడంపల్లిలో మేక

జహీరాబాద్ టౌన్: విద్యుదాఘాతంతో మేక మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన మొగుడంపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. మొగుడంపల్లికి చెందిన వడ్డే లక్ష్మయ్య మేకలు మేతకు వెళ్లాయి. ఓ మేక పొలం పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సపోర్టు తీగకు తాకింది. దీంతో కరెంట్ షాక్ కొట్టి అక్కడికక్కడే మృత్యువాత పడింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



అనిల్ కుమార్(ఫైల్)

పటాన్‌చెరు టౌన్: స్కూటీని లారీ ఢీకొట్టడంతో యువకుడు మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. సంగారెడ్డి ద్వారకా నగర్‌కు చెందిన సాయి దుర్గాప్రసాద్ (25) ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి స్కూటీపై పటాన్‌చెరు మండలం ఇంద్రేశం నుంచి సంగారెడ్డి వైపు వెళ్తున్నాడు. ముత్తంగి స్వీట్ హార్ట్ హోటల్ సమీపంలోకి రాగానే సంగారెడ్డి వైపు వెళ్తున్న లారీ స్కూటీని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై సాయి దుర్గాప్రసాద్ మృతి చెందాడు. మృతుడి తల్లి భాగ్యలక్ష్మీ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ మరో యువకుడు

వెల్దుర్తి(తూప్రాన్) : అప్పుల బాధతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన మండలంలోని శెట్టిపల్లికలాన్ గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన పడిగె వెంకట్, స్వరూప దంపతుల ఏకైక కుమారుడు అనిల్ కుమార్(28) వ్యవసాయంతో పాటు పౌల్ట్రీ ఫామ్ నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవలె వింత వ్యాధితో కోళ్లు మృత్యువాత పడుతుండటంతో పౌల్ట్రీ ఫామ్ సరిగా నడవలేదు. అలాగే పొలం వద్ద బోర్లు వేస్తే పడలేదు. దీంతో సుమారు రూ.15 లక్షల వరకు అప్పు అయ్యింది. అప్పులు భారంతో మూడు రోజుల కిందట పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. కుటుంబీకులు చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అనుమానాస్పదస్థితిలో బైక్ మెకానిక్



అఖిల్ మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు

దుబ్బాక : అనుమానాస్పద స్థితిలో బైక్ మెకానిక్ మృతి చెందిన ఘటన దుబ్బాక పట్టణం శివారులో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ గంగరాజు కథనం మేరకు.. మండలంలోని ఆరపల్లి గ్రామానికి చెందిన మంచె నర్సింలు కూలీ పనులు చేసుకుంటూ భార్య జమున కుమారుడు అఖిల్(27) తో దుబ్బాకలో నివాసం ఉంటున్నాడు. అఖిల్ పట్టణంలో బైక్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం పెద్దగుండవెల్లి ఎల్లమ్మ ఆలయం వద్ద జరిగిన బంధువుల విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. సాయంత్రం అఖిల్ మిత్రుడు భూంపల్లి మండలం చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన వల్లెపు సంతోష్‌తో కలిసి పట్టణంలోని ఎల్లమ్మ టెంపుల్ సమీపంలో రాత్రి వరకు మద్యం తాగారు. అనంతరం అఖిల్ బైక్, సెల్‌ఫోన్ తీసుకొని సంతోష్ ఇంటికి వెళ్లిపోయాడు. సోమవారం తెల్లవారు జామున అఖిల్ ఎల్లమ్మ టెంపుల్ సమీపంలో మృతి చెంది ఉన్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని గుండెలవిసేలా రోదించారు. తన కుమారుడు మృతికి సంతోష్ కారణమని అనుమానం వ్యక్తం చేస్తూ అఖిల్ తండ్రి నర్సింలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గంజాయి రహిత సిద్దిపేటకు సహకరించాలి

సీపీ అనురాధ



శిక్షణ తీసుకున్న వారిని అభినందిస్తున్న సీపీ

సిద్దిపేటకమాన్: గంజాయి, ఇతర మత్తు పదార్థాల రహిత జిల్లాకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సిద్దిపేట సీపీ అనురాధ తెలిపారు. తెలంగాణ నార్కోటిక్ డ్రగ్ యాంటీ నార్కోటిక్ సోల్జర్‌గా ఎంపికై శిక్షణ పూర్తి చేసుకున్న జిల్లాకు చెందిన జనార్దన్, శ్రీనివాస్ సీపీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా సీపీని సోమవారం కలవగా వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యాంటీ డ్రగ్స్ సోల్జర్స్ సేవలు వినియోగించుకోవాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ముఖ్యమైన కార్యక్రమాల్లో పోలీసులతో కలిసి పాల్గొనాలని సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై ఏదైనా సమాచారం ఉంటే డయల్ 100 లేదా పోలీసు కంట్రోల్ రూమ్ 8712 667100కు సమాచారం తెలపాలన్నారు. అలాగే యువత బెట్టింగ్‌లు పెట్టి డబ్బులు నష్టపోయి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు.

చెద.. నిర్లక్ష్యం చేస్తే వ్యర్థ

- వ్యవసాయ పంటలపై చెద పురుగు
- పూర్తిగా కప్పేసి కాండం పీల్చేస్తున్న వైనం
- ఎండిపోయి గిడసబారిపోతున్న మొక్కలు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న మిరుదొడ్డి ఏఈఓ సమ్రీన్



మిరుదొడ్డి(దుబ్బాక): చెదలు వ్యవసాయ సాగు పంటలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంటాయి. వివిధ పంటల దిగుబడిపైనే కాకుండా బట్టలు, కొయ్య సామగ్రిని ఆశించిన చెద పురుగులు తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయి. ముఖ్యంగా ఆహార పంటలను, నూనె గింజల సాగును, పండ్ల మొక్కలు, అలంకరణ మొక్కలపై చెట్లను ఆశిస్తాయి. అలాగే అడవి జాతి చెట్లను తినేస్తాయి. ఇవి ఎక్కువగా ఎర్ర మట్టి నేలలు, చెల్క నేలల్లో జీవిస్తూ నష్టాన్ని కలిగిస్తాయి. సకాలంలో చెద పురుగులను నిర్మూలించకుంటే తీవ్ర నష్టాలను చవి చూడాల్సి వస్తుందని ఏఈఓ సమ్రీన్ తెలిపారు. చెద పురుగులు వ్యవసాయ పంటలను, చెట్లను ఏవిధంగా ఆశించి నష్ట పరుస్తాయి, వాటి నివారణకు చేపట్టాల్సిన విధి విధానాలు ఆమె మాటల్లో...

నాలుగు రకాల తెగలు

చెద పురుగులు పుట్టల్లో చాలా వరకు సామూహికంగా జీవిస్తాయి. వాటిలో నాలుగు రకాల తెగలు ఉన్నాయి. రాజు, రాణి, పని చేసే చెద పురుగులు, సైనిక చెద పురుగులు అనే తెగలు ఉన్నాయి.

సంతతి పెంచుకుంటాయి

రాణి, రాజు పురుగులు రెక్కలను కలిగి ఉంటాయి. ఇవి వేసవి కాలంలో పుట్టలో ఉండి జీవిస్తాయి. తొలకరి వర్షాలు పడ్డప్పుడు రాణి, రాజు పురుగులు పుట్టనుంచి బయట కొచ్చి సంపర్కం జరుపుతాయి. అనంతరం గుడ్లు పెట్టడం ప్రారంభించి రోజుకు సుమారు 30 వేల నుంచి 80 వేల వరకు పెడుతాయి. గుడ్ల నుంచి పిల్ల పురుగులు నెల నుండి మూడు నెలలలోపు బయటకు వస్తాయి. పిల్ల పురుగులు పెద్ద పురుగులుగా మారడానికి సంవత్సర కాలం పడుతుండటం విశేషం. పని చేసే పురుగుల కంటే సైనిక పురుగులు పెద్దవిగా ఉండి రెక్కలు లేకుండా ఉంటాయి.

నివారణ చర్యలు ఇలా

- పంట పొలాల్లో ఉన్న చెద పురుగుల పుట్టలను పూర్తిగా తవ్వివేయాలి. పుట్టలో ఉన్న తల్లి పురుగును గుర్తించి పూర్తిగా నిర్మూలించాలి. లేదా 5 మిల్లీ లీటర్ల క్లోరిఫైరిఫాస్ మందును లీటర్ నీటిలో కలిపి చెద పుట్టలు పూర్తిగా నానేట్లు తడుపుకోవాలి.
- చెద పురుగులు ఉన్న ప్రాంతాలను గుర్తించి కిలో వేరు శనగ విత్తనాన్ని 6.5 మి. లీ. క్లోరిఫైరిఫాస్‌తో విత్తన శుద్ధి చేసి నీడలో ఆరబెట్టుకోవాలి. అలా ఆరబెట్టిన విత్తనాలను మరుసటి రోజు విత్తుకోవాలి.
- చెరకు గడలను లీటర్ నీటికి 2.0 మి.లీ మాలథియాన్ 0.1 శాతం ద్రావణంలో 15 నిమిషాలు నానబెట్టిన తర్వాత విత్తుకోవాలి.
- పండ్ల తోటల్లో మొక్కలను నాటే గుంతల్లో మిథైల్ పెరాథియాన్ పొడి మందును 100 గ్రాముల మోతాదు వేసుకోవాలి. ఏపుగా పెరిగిన చెట్ల మొదళ్లకు కోల్‌తార్ ద్రావణం పూయటం వల్ల చెద పురుగులను పూర్తిగా అరికట్ట వచ్చు.

ఈ విధంగా నష్ట పరుస్తాయి

పని చేసే పురుగులు పంట పొలాల్లో ఎక్కువగా కనిపిస్తాయి. పంట మొక్కల కాండాలను ఆశించి లోపలి పదార్థాన్ని తింటాయి. అలా తినడం వల్ల కాండంలో ఖాళీ ప్రదేశాలు ఏర్పడుతాయి. అక్కడ మట్టిని నింపుతాయి. ఇట్టి మొక్కలు మొదట పూర్తిగా వడలిపోయి ఎండుముఖం పడుతాయి. అనంతరం మొక్కలు చనిపోయి దిగుబడి తగ్గిపోతుంది. నీటి ఎద్దడి కలిగి ఉన్న పండ్ల తోటల్లో ఈ పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. పండ్ల మొక్కలను, అటవీ మొక్కల బెరడును తింటూ మట్టితో కప్పి పెడతాయి. దీంతో పండ్ల మొక్కలు పూర్తిగా గిడసబారి పోతాయి.



మామిడి చెట్టును మట్టితో నింపిన చెద పురుగులు